క్లుప్తంగా

బాధ్యతగా పరిసరాల పరిశుభ్రత


మొక్క నాటుతున్న ఈఓ నాగరత్నమ్మ

కార్వేటినగరం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని సర్పంచ్ ధనంజయవర్మ తెలిపారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్‌లో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. సర్పంచ్ మాట్లాడుతూ స్వచ్ఛ కార్వేటినగరం కోసం ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈఓ నాగరత్నమ్మ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పర్యావరణ రక్షణకు ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు.

ఇరగాలమ్మకు విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

శ్రీరంగరాజపురం : మండలంలోని మూలూరు గ్రామంలో వెలసిన ఇరగాలమ్మకు ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. నేతి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేపట్టారు. రాత్రి ఇరగాలమ్మను ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

వేరుశనగలో కలుపు నివారణ


వేరుశనగ సాగులో కలుపు తీస్తున్న కూలీలు

విజయపురం : వేరుశనగ సాగులో కలుపు సమస్య రైతులను తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి కలుపు ఎక్కువైంది. దీంతో రైతులు కలుపు నివారణకు నానా తంటాలు పడుతున్నారు. అయితే కలుపు సమస్య తీవ్రంగా ఉన్న భూముల్లో వేరుశనగ విత్తిన 48 గంటల్లోపు ఒక ఎకరాకు 200 లీటర్ల నీటికి 1లీటరు పెండిమిథాలిన్ కలిపి నేలపై పిచికారి చేస్తే 25 రోజుల వరకు కలుపు లేకుండా ఉంటుందని అధికారులు తెలిపారు. విత్తిన 25 రోజుల తర్వాత వెడల్పు ఆకులు గల కలుపు మొక్కలు ఉన్నట్లయితే ఎకరాకు ఇమాజితాఫిర్ 10% లేదా ఇమాజీమాక్స్ 35% కలుపు మందును 40 గ్రా. ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి మొక్కలపై స్ప్రే చేసి అన్ని కలుపు మొక్కలను నివారించవచ్చని పేర్కొన్నారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న టీడీపీ నేతలు

నగరి : స్వర్గీయ రామారావు వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక టీడీపీ నేతలు బస్టాండు ప్రాంగణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్ల పరిశీలన


రోడ్డు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

శ్రీరంగరాజపురం : పుల్లూరు నుంచి రంగంపేట వరకు దెబ్బతిన్న రోడ్లను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే థామస్ శనివారం పరిశీలించారు. ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ రహదారుల మరమ్మతులను వేగవంతం చేయాలని ఆదేశించారు. సింగిల్ రోడ్లను వెడల్పు చేసేందుకు నిధులు మంజూరు చేయించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు కలెక్టర్ స్పందిస్తూ రోడ్ల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ మోహన్‌మురళి పాల్గొన్నారు.

ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ప్రతి ఏటా నష్టపోతున్నారు. దీంతో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టారు. మండలంలో రైతులు పామాయిల్ తోటలు సాగు చేసి మంచి దిగుబడితో పాటు లాభాలు అందుకుంటున్నారు. గత ప్రభుత్వం సహకారం, రాయితీపై మొక్కలు, డ్రిప్, రసాయన ఎరువులు అందించాయి. దీంతో మండలంలో సుమారు 20 ఎకరాలకు పైగా పామాయిల్ సాగులోకి వచ్చింది.

సర్కారు సబ్సిడీ..

దశాబ్దాల దిగుబడి


ముత్యాలరెడ్డికండ్రిగలో సాగు చేసిన పామాయిల్ పంట

- ఒక సారి నాటితే 30 ఏళ్ల దిగుబడి
- వ్యయం తక్కువ ఆదాయం ఎక్కువ
- దిగుబడి రాగానే ఖాతాలకు చేరుతున్న సొమ్ము

విజయపురం : పామాయిల్ (ఆయిల్‌పామ్) సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని, లాభాలు పొందే అవకాశముందని రైతులు ఆ వైపు మొగ్గు చూపుతున్నారు. అంతే కాకుండా గోద్రేజ్ ప్రైవేట్ లిమిటెడ్ వారు విత్తనం ఇవ్వడంతో పాటు, దిగుబడి వచ్చిన పంటను పొలం వద్దకు వచ్చి గెలలను రైతుల నుంచి సేకరిస్తారు. అంతర్జాతీయంగా మారిన సమీకరణల వల్ల మలేషియా వంటి దేశాల నుంచి పామాయిల్ దిగుమతులపై ఆంక్షలు విధించడంతో ఈ పంటకు డిమాండ్ పెరిగింది. ఈ చెట్టు పల్ప్ నుంచి పామాయిల్ తీస్తారు. అలాగే కెర్నల్ నుంచి తీసే నూనెను కాస్మొటిక్స్‌కు వాడుతారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా దీనికి డిమాండ్ ఉంది. అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉండడంతో రైతులు ఈ పంట సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

250 ఎకరాల్లో సాగు


ఎగుమతికి సిద్ధంగా ఉన్న పామాయిల్ సీడ్స్

జిల్లాలో ఉద్యానవన శాఖ 250 ఎకరాల్లో ఈ పంటను సాగు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా నగరి నియోజవకర్గంలోని నగరి మండలం ఎం.కొత్తూరు, అర్జునప్ప కండ్రిగ, వేలావడి, బుగ్గ అగ్రహారం గ్రామాల్లోను విజయపురం మండలం విజయపురం, ముత్యాలరెడ్డికండ్రిగ, కోసలనగరం, క్షూరికాపురంలలో సుమారు 30 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగులో ఉండగా మరో 60 ఎకరాలు సాగుకు అనువుగా గుర్తించి పనులు ప్రారంభించారు. వరి, వేరుశనగ లాంటి సంప్రదాయ పంటలు సాగుచేసి దిగుబడి వచ్చే సమయంలో గిట్టుబాటు ధరకోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి. ఈ పంటలో ఆ బాధలు లేవని దిగుబడి రావడంతో కంపెనీ ప్రతినిధులు వచ్చి తీసుకుపోతారని వాటికి సంబంధిత పైకం ఖాతాలకు జమచేస్తారని రైతులు తెలుపుతున్నారు. మినిమమ్ సపోర్ట్ ప్రైజ్ ఉంటుంది కనుక రైతుకు నష్టాలు వచ్చే ఆస్కారం లేదని ఉద్యానవన శాఖ అధికారులు తెలుపుతున్నారు. ఒకరిని చూసి ఒకరంటూ ఈ పంట సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు.

ఒక సారి సాగు చేస్తే 30 ఏళ్ల దిగుబడి

నేలను సాగుచేసి మొక్కలను తెచ్చి రైతులు నాటుకోవాలి. ఒక్కొక్క మొక్క ధర రూ.133 అయితే, ఈ మొక్కలను ప్రభుత్వం సబ్సిడీపై ఉచితంగా అందిస్తోంది. 30 ఏళ్ల జీవిత కాలం ఉండే ఈ చెట్లు నాలుగేళ్ల నుంచి దిగుబడిని ఇస్తుంది. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి యాజమాన్యం సమృద్ధిగా పాటిస్తూ చెట్టు వద్ద తేమను ఉంచడం, అప్పుడప్పుడూ కలుపు తీసి ఎరువులు వేయడం మాత్రమే రైతు చేయాలి. జనవరి నుంచి తొలకరి వచ్చేవరకు చెట్టుకు నీరందించడంపై ఎక్కువ శ్రద్ధ చూపాల్సి ఉంటుంది. ఆపై వర్షాలతో తేమ ఉంటుంది కనుక నీటి ఖర్చులు ఎక్కువగా ఉండవు. ఇలా చేస్తూ పోతే ప్రతి నెలా స్థిరమైన ఆదాయం ఉంటుంది. చెట్టు పెద్దదయ్యే కొద్దీ దిగుబడి పెరుగుతుంది. ఎకరాకు పది టన్నుల వరకు దిగుబడి ఉంటుంది. తరచూ దున్నే పని లేదు కనుక కూలీల ఖర్చు ఎక్కువగా ఉండదు, చీడపీడల సమస్య ఉండదు, ఎరువుల ఖర్చు తక్కువే అవుతుంది కనుక లాభాలు ఎక్కువగా ఉంటాయి. ఇప్పటి ధర టన్నుకు రూ.17,850ని లెక్కలోకి తీసుకుంటే ఎకరాకు పది టన్నులు సాగుచేసే రైతుకు రూ.1.79 లక్షల ఆదాయం వస్తుంది. పెట్టుబడులు ఎకరాకు రూ.40 వేలు తీసివేసినా రైతుకు రూ1.39 లక్షల వరకు ఆదాయం వస్తోంది. రైతు సాగుచేసే విస్తీర్ణాన్ని బట్టి ఆదాయం పెరుగుతుంది. నెలకు రెండు, మూడు దఫాలుగా దిగుబడి ఉంటుంది. వాతావరణ ప్రభావం ఈ పంటపై ఉండదు. కనుక రైతుకు లాభదాయకమైన పంటగా పామాయిల్ సాగు మారుతోంది

సంచార జాతులకు ఇంటి స్థలాలు

గంగాధర నెల్లూరు : మండలంలోని సంచార జాతులైన పది మంది పిచ్చిగుంట్ల కులస్తులకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే థామస్ శనివారం ఇంటి స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ డీనటల్ ట్రైబ్స్ ఆర్థిక సాధికారత పథకం కింద నివాస స్థలాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇళ్లు నిర్మించుకునేందుకు సైతం ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందని తెలిపారు. ఇంటి స్థలం, వ్యవసాయ భూమి కావాల్సిన అర్హులు వివరాలు అందిస్తే త్వరలో పట్టాల పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు. ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ సంచార జీవనం గడుపుతున్న వారిని బీసీ– ఏగా గుర్తించి కుల ధ్రువీకరణ పత్రం, ఇంటి పట్టాలు మంజూరు చేయిస్తామని చెప్పారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ.50 వేలు అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమములో జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, ఎంపీడీఓ హరి ప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


పట్టాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

అక్షరాస్యత పెంచడమే లక్ష్యం


మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలసముద్రం : నిరక్షరాస్యులను చదివించి అక్షరాస్యత శాతం పెంచడమే లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమం చేపట్టినట్టు జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజ్ తెలిపారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో ఉల్లాస్ పురోగతిపై ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి ఆధ్వర్యంలో వలంటీర్లతో సమీక్షించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వలంటీర్లు తమకు కేటాయించిన నిరక్షరాస్యులకు చక్కగా చదువు నేర్పించాలని సూచించారు. ఇందుకోసం పుస్తకాలు, పలక, బలపం అందిస్తామని వెల్లడించారు.

అందరికీ అక్షరాస్యతే లక్ష్యం

గుడిపాల: ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల సమాఖ్య కార్యాలయంలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లాస్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఇందులో భాగంగా మహిళా సంఘాల్లో ఎవరైనా నిరక్షరాస్యులున్నట్లయితే వారిని గుర్తించాలన్నారు. గుర్తించిన వారందరికీ జనవరి 20వ తేదీ నుంచి చదువు నేర్పించాలన్నారు. వారికి తోడ్పడేలా చెప్పాలన్నారు. ఇందుకు ఆయా గ్రామాల్లో ఉన్న సంఘమిత్రలు కీలకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం వాటికి సంబంధించిన మెటీరియల్‌ను ఏపీఎం సుధారాణికి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరాజన్, వెలుగు సీసీలు లోకనాథరెడ్డి, సహదేవ్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న ఏపీసీ వెంకటరమణ

చిత్తూరు కలెక్టరేట్: యూటీఎఫ్ డైరీని జిల్లా సమగ్రశిక్ష శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ చేతుల మీదుగా శనివారం ఆవిష్కరింపజేశారు. ఏపీసీ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల పెంపు కోసం టీచర్లు బాధ్యతగా పనిచేయాలన్నారు. రానున్న విద్యాసంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు పటిష్ట ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖరనాయుడు, మణిగండన్ పాల్గొన్నారు.

రేపు పుత్తూరులో జాబ్ మేళా

పుత్తూరు: పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఎక్స్‌చేంజ్, సిడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ కంపెనీలైన టెక్ మహేంద్ర, డిక్సాన్, అపోలో ఫార్మసీ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తారని వివరించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమా, ఎనీ ఫార్మసీ, డిగ్రీ విద్యార్హత కలిగిన 18 నుంచి 30 ఏళ్ల లోపు వారు అర్హులని వెల్లడించారు. అభ్యర్థులు ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్లు, ఐడీ ప్రూఫ్‌తో హాజరు కావాలన్నారు. వివరాలకు 6300954441ను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఐక్యంగా వర్గీకరణపై పోరాటం

కార్వేటినగరం : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు ఐక్యమత్యంతో పోరాటం చేయాలని ఎస్సీ ఉద్యోగ సంఘం నేత చలపతిరావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న ఎస్సీ వర్గీకరణ కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఆధ్వర్యంలో చిత్తూరులో నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించే వర్గీకరణ సమావేశానికి మాల సోదరులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. వర్గీకరణతో మాలలకు జరిగే నష్టాలను కమిషన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎస్సీల అభ్యున్నతికి ప్రభుత్వం ఏటా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, రిజర్వేషన్‌లో వర్గీకరణ చేయడం సరికాదని స్పష్టం చేశారు. అన్నదమ్ములుగా మెలిగే మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టడం దారుణమని, వర్గీకరణ నిర్ణయాన్ని పునః సమీక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలల ఐక్యవేదిక నేతలు సత్యనారాయణ, కె.నాగరాజు, దొరబాబు, బాబు పాల్గొన్నారు.

20 నుంచి పశు వైద్య శిబిరాలు

నింద్ర: మండలంలో ఈనెల 20వ తేదీ నుంచి ప్రతి పంచాయతీలో పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి సాయి సంధ్య తెలిపారు. ఆమె శనివారం మండల కేంద్రంలో మాట్లాడుతూ 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అన్ని పంచాయతీల్లో పశువులకు వైద్యసేవలు నిర్వహించడం, పాడి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాడి రైతులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏడీఎంఎస్ ఈ- బైక్స్ షోరూమ్ ప్రారంభం


షోరూమ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

గంగాధరనెల్లూరు : నీవా నది సమీపంలోని వేల్కూరు వద్ద శనివారం ఏడీఎంఎస్ ఈ–బైక్ షోరూమ్‌ను ఎమ్మెల్యే థామస్, కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాబోయే కాలంలో ఎలక్ట్రికల్ బైక్స్ హవా కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో షోరూమ్ నిర్వాహకుడు ప్రభు, సహ నిర్వాహకుడు రాజా పాల్గొన్నారు.

మృత్యు మలుపు

వడమాలపేట (విజయపురం) : చెన్నై–తిరుపతి జాతీయ రహదారి వడమాలపేట మండలంలోని కదిరిమంగళం మలుపు మృత్యు నిలయంగా మారింది. గడిచిన నెల రోజుల్లో ఇద్దరు మృత్యువాత పడ్డారు. తిరుపతి నుంచి వడమాలపేటకు వచ్చే బస్సు, ఆటో, ద్విచక్ర వాహనదారులు కదిరి మంగళం మలుపు వద్ద యూటర్న్ తీసుకొనే సమయంలో ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. జాతీ య రహదారిపై సూచిక బోర్డు, స్పీడ్ బ్రేకర్ లేకపోవడంతో చెన్నై నుంచి తిరుపతికి వెళ్లే వాహనాలు వేగంగా వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్‌తోపాటు సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలి


నగరి: రోడ్డు శుభ్రపరుస్తున్న కమిషనర్


విజయపురం : మొక్కలు నాటుతున్న ఎంపీడీవో, తహసీల్దార్

పుత్తూరు: పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ ఎ.హరి పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. మున్సిపల్ సిబ్బంది, మెప్మా, సచివాలయ సిబ్బందితో కలిసి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మాస్ క్లీన్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాలను, చెత్త కుప్పలను, కాల్వలను, పబ్లిక్ టాయిలెట్స్‌ను శుభ్రపరచుట జరుగుతుందని వివరించారు. అలాగే రోడ్లకు ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించనున్నట్లు చెప్పారు. ఇందులో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.మంజునాథ్‌గౌడ్, వైస్ చైర్మన్ డి.జయప్రకాష్ పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్

పాలసముద్రం : స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్‌లో భాగంగా శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డీపీఓ సుధాకర్ రావు, డీపీఆర్సీ షణ్ముగం పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. డీపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని సూచించారు. రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి, ఏపీఓ మార్గరేట్, జేఈ అనుషా పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

విజయపురం : మనమందరం మొక్కల నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఎంపీడీవో ఎంవీఎస్ రాజేంద్ర తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అధికారులు మొక్కలు నాటారు. బస్టాండు నుంచి ర్యాలీ చేశారు. కాలువల్లో పూడిక తొలగింపు, సామూహిక మరుగుదొడ్లు శుభ్రం చేయడం, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, అధికారులు పాల్గొన్నారు.

సామాజిక భాగస్వామ్యం పెంపొందించాలి

నగరి : పర్యావరణ పరిరక్షణలో సామాజిక భాగస్వామ్యాన్ని పెంపొందించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. నగరి మున్సిపల్ పరిధిలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. బైపాస్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో భాగంగా ప్రధాన కూడళ్లు, బస్టాండ్లతో పాటు పలు ప్రాంతాల్లో పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టారు. రోడ్లు ఊడవడం, కాలువల్లో పూడిక తొలగింపు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నగరి మున్సిపల్ మేనేజర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ అధికారి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఏఈలు, వార్డు సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో స్వచ్ఛ భారత్

నింద్ర: మండలంలో ప్రతి గ్రామం స్వచ్ఛభారత్ కార్యక్రమాలు చేపట్టాలని మండల పంచాయతీ విస్తరణ అధికారి లక్ష్మీపతి తెలిపారు. మండలంలోని ఇరుగువాయి గ్రామంలో శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాలు పంచాయతీల్లో చేట్టాలని అన్నారు. ప్రతి గ్రామంలోని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి పాల్గొన్నారు.







పుత్తూరు: ర్యాలీని ప్రారంభిస్తున్న చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, పాలసముద్రం : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది, నింద్ర: మాట్లాడుతున్న పంచాయతీ విస్తరణ అధికారి

నూతన బార్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం

చిత్తూరు అర్బన్: న్యాయవాదుల సంక్షేమానికి తమవంతు కృషి చేస్తామని చిత్తూరు బార్ అసోసియేషన్(న్యాయవాదుల సంఘం) అధ్యక్షుడు కె.శంకర నాయుడు అన్నారు. చిత్తూరు నగరం జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ భవనంలో శనివారం నూతనంగా ఎన్నికైన న్యాయవాదుల సంఘం కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షునిగా కె.శంకరనాయుడు, కార్యదర్శిగా సురేష్‌రెడ్డి, ఉపాధ్యక్షునిగా భూప్రసన్న, సంయుక్త కార్యదర్శిగా షఫీఉల్లా, కోశాధికారిగా ఎస్ ఆనంద్, స్పోర్ట్స్ కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం, లైబ్రరీ కార్యదర్శిగా రవిచంద్రన్, సాంస్కృతిక కార్యదర్శిగా రాజాచంద్రయాదవ్, కార్యవర్గ సభ్యులుగా చిన్నబ్బ, శరవణ, తులసీరామ్, రవికుమార్, అక్బర్ బాషా ప్రమాణం చేశారు. న్యాయవాదుల సంఘం సలహాదారులుగా వసంతకుమార్, రేణుకను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రరెడ్డి, అశోక్‌ఆనంద్ యాదవ్, ఎన్నికల అధికారి వసంతకుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మద్యం సేవించి బండి నడిపితే చర్యలు

చిత్తూరు అర్బన్: మద్యం సేవించి బండి నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ నిత్యాబాబు హెచ్చరించారు. మద్యం సేవించి, వాహనాలను నడుపుతూ శుక్రవారం పట్టుబడిన 13 మందికి రూ.10 వేల చొప్పున్న జరిమాన విధించామన్నారు. గత 12 నెలల వ్యవధిలో 690 మంది పట్టుబడగా రూ.69 లక్షలు జరిమానా విధించామన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే 185 సెక్షన్ కింద నేరమన్నారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఆయన పేర్కొన్నారు.